# బమ్మెరలో ఘనంగా పోతన జయంతి వేడుకలు




## భాగవత ఉద్భవ సాహిత్య ఉత్సవాలు

**బమ్మెర, సెప్టెంబర్ 20 (తెలుగు గళం)**

సహజకవి బమ్మెర పోతన జయంతిని పురస్కరించుకుని ఆదివారం బమ్మెర పోతన స్మారక కేంద్రంలో భాగవత ఉద్భవ సాహిత్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోతన విగ్రహానికి పూజలు నిర్వహించి, ఆయన సాహిత్య సేవలను స్మరించుకున్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, అర్చకులు కె.వి.జి.కె. ఆచార్య మాట్లాడుతూ..పోతన రచించిన భాగవతం ద్వారా అందించిన సందేశాన్ని నేటి తరానికి అందించి, ఆ విలువలను ఆచరిస్తూ ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.సౌదామని సాహిత్య సంస్థ కామారెడ్డిగూడెం వ్యవస్థాపక అధ్యక్షుడు చింత ప్రసాద్ మాట్లాడుతూ పోతన చరిత్రను నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోతన స్మారక కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయడంతో పాటు ఆయనకు సంబంధించిన ఆనవాళ్లను పరిరక్షించాలని కోరారు.రామాలయ పూజారి బట్టర్ రామాచార్యులు మాట్లాడుతూ పోతన సాహిత్య వారసత్వాన్ని కాపాడుకోవాలని, ఆయన పద్యాలను యువతకు, భావితరాలకు చేరేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వచ్చే ఏడాది మరింత ఘనంగా పోతన జయంతిని నిర్వహించి, కవి సమ్మేళనం ఏర్పాటు చేసి పోతన వైభవాన్ని ప్రజలకు తెలియజేస్తామని సర్పంచ్ రమ్య ప్రశాంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు.పోతన జన్మించిన గ్రామంలో నివసిస్తూ ఆయన మధురమైన పద్యాలను స్మరించుకోవడం తమ అదృష్టమని పోతన సాహిత్య కళావేదిక కార్యదర్శి దేవసాని ఉపేందర్, శ్రీరామదాసు భజన మండలి మండల అధ్యక్షుడు సోమ సత్యం పేర్కొన్నారు.పోతన వైభవం అందరికీ చేరేలా ప్రభుత్వం పోతన జయంతిని అధికారికంగా నిర్వహించాలని పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్ కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీరామదాసు భజన మండలి సభ్యులు, వార్డు సభ్యుడు వంగాల భాస్కర్, ఉపాధ్యాయుడు కొంగ సురేష్, యువ నాయకుడు ఉడుత నరేష్, ఉప్పలయ్య, కొమురయ్య, పెంతల బిక్షం, సోమ, నారాయణ, మారం వెంకన్న, అంజమ్మ, సోమేశ్వర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జగదీష్ మృతి అత్యంత బాధాకరం.

బద్రు నాయక్ ఉపేంద్ర బాయి.



**ఖమ్మం,20 సెప్టెంబర్ (తెలుగు గళం):**

మానవత్వం, సేవా భావం తో పేదల జీవితాలలో వెలుగులు నింపిన ప్రజా వైద్యులు ప్రముఖ న్యూరో సర్జన్ జగదీష్ ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని లంబాడి హక్కుల పోరాట సమితి ( ఎల్ హెచ్ పి ఎస్ ) రాష్ట్ర అధ్యక్షులు బానోతు బద్రు నాయక్ , వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్రబాయి లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి చెప్పారు. ఆదివారం ఉదయం సూర్యాపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందటం తమ హృదయములను తీవ్రంగా కలచి వేసిందని పేర్కొన్నారు. చాలామంది పేదల జీవితాలలో వెలుగులు నింపి, వారికి ఒక ఆశా కిరణంగా నిలిచిన డాక్టర్ జగదీష్ చిన్న వయసులో నేను మృతి చెందడం నమశక్యం కావడం లేదన్నారు. ఇలాంటి విషాద వార్త ఈ ఆదివారం వినవలసి రావడం దురదృష్టకరమన్నారు. మంచి మనిషిగా , అందరికీ ఆప్తుడుగా నిలిచిన డాక్టర్ జగదీష్ ను కోల్పోవడం విచారకరమన్నారు. దేవుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని తమ ప్రకటనలో బద్రు నాయక్ , ఉపేంద్ర బాయి కాంక్షించారు.

# జాతీయ ఉత్తమ రక్తదాత పురస్కారం అందుకున్న సామాజిక కార్యకర్త పల్లె రాజిరెడ్డి

**తెలుగు గళం న్యూస్ జఫర్‌గఢ్ సెప్టెంబర్ 20**



జఫర్‌గఢ్ మండలం కూనూరు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, రక్తదాత పల్లె రాజిరెడ్డికి జాతీయ ఉత్తమ రక్తదాత పురస్కారం లభించింది.యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు.అధికసార్లు రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందిస్తూ చేస్తున్న సేవలను గుర్తించి పల్లె రాజిరెడ్డిని జాతీయ ఉత్తమ సేవా పురస్కారం--2026కు ఎంపిక చేశారు. సుమారు 40 సార్లు రక్తదానం చేసినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరల్డ్ బుక్ రికార్డ్ ఆఫ్ బ్లడ్ డోనర్ డాక్టర్ సంపత్‌కుమార్, ప్రముఖ ఇన్‌ఫ్లుయెన్సర్ గౌతమ్, సంస్థ అధ్యక్షుడు కురుమేటి నవీన్ తదితరులు పల్లె రాజిరెడ్డిని శాలువా, సన్మాన పత్రంతో ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేశారు. రక్తదాతగా ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని అతిథులు కొనియాడారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికసార్లు రక్తదానం చేసిన రక్తదాతలను గుర్తించి ఈ పురస్కారాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జాతీయ ఉత్తమ రక్తదాత పురస్కారం పల్లె రాజిరెడ్డికి లభించడంపై కూనూరు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# తమ్ముడిని కత్తితో పొడిచి హత్య చేసిన అన్న

## నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు



**గీసుగొండ,20 సెప్టెంబర్ (తెలుగు గళం):** గరీబ్‌నగర్‌లో అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. గరీబ్‌నగర్‌కు చెందిన ఎలుబాక ప్రసాద్ (31) వెల్డింగ్ పని చేస్తూ తల్లి సుజాతతో కలిసి ఉంటున్నాడు. అతడి అన్న ఎలుబాక ప్రవీణ్ (32) కీర్తినగర్‌లో భార్య, పిల్లలతో నివసిస్తున్నాడు.ఈ క్రమంలో శనివారం రాత్రి ప్రసాద్ ఇంటి వద్దకు వచ్చిన ప్రవీణ్ అతడితో గొడవపడి కత్తితో వీపు, ఎడమ ఛాతి, ఎడమ భుజంపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. హత్య కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టాం. త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తాం అని గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.

మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

# జనగామలో చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టులకు రాత పరీక్ష

## 111 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

**తెలుగు గళం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 20**

జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను ఆదివారం ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు.జనగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో బచ్చన్నపేట మండలం కేసిరెడ్డిపల్లి, దేవరుప్పుల మండలం గొల్లపల్లి, జనగామ మండలం చౌదర్పల్లి, పెద్దపహాడ్, రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరి, రఘునాథపల్లి, ఎల్లారెడ్డిగూడెం, కోమల్ల, భాంజిపేట గ్రామాలతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి, పాలకుర్తి మండలం ముత్తారం గ్రామాల్లో డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.ఈ పోస్టుల భర్తీకి మొత్తం 126 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 115 మంది అర్హత సాధించారు. వీరిలో 111 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. రాత పరీక్ష అనంతరం హాజరైన అభ్యర్థులకు మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) నిర్వహించారు.ఇంటర్వ్యూ కమిటీకి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఛైర్మన్‌గా వ్యవహరించగా, జిల్లా ఉపాధి అధికారి, జనగామ రెవెన్యూ డివిజనల్ అధికారి సభ్యులుగా పాల్గొన్నారు.అభ్యర్థులను కమిటీ సభ్యులు ముఖాముఖిగా ఇంటర్వ్యూ చేశారు.కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, డీ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక పోలీస్ బందోబస్తు

**ములుగు, సెప్టెంబర్ 20 ( తెలుగు గళం):**



గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ములుగు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ కే. సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐపీఎస్ తెలిపారు.

నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, గణేష్ విగ్రహాల ఊరేగింపులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ హైటెన్షన్ వైర్లకు విగ్రహాలు తగలకుండా పోలీస్ శాఖ నిర్దేశించిన మార్గాల్లోనే విగ్రహాలను తీసుకెళ్లాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. మైక్‌ల వినియోగానికి సంబంధించి సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఏటూరునాగారం ఏఎస్పీ పరిధిలోని వారు ఏఎస్పీ వద్ద, ములుగు సబ్ డివిజన్ పరిధిలోని వారు ములుగు డీఎస్పీ వద్ద అనుమతి పొందాలని తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లోని చెరువులు, వాగులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈత రాని వారు నీటిలోకి వెళ్లరాదని సూచించారు. చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకువచ్చే తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.నిమజ్జనానికి వచ్చే వాహనాలను నిర్దేశించిన మార్గాల్లోనే నడపాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బాణాసంచా కాల్చరాదని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి గణేశ్ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని కోరారు.

# పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యం

## దేవరుప్పుల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం పూర్తి




**తెలుగు గళం న్యూస్ జనగామ, సెప్టెంబర్ 20**




విద్యార్థులకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు దేవరుప్పుల మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆదివారం మండలంలోని ప్రతి పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, కలుపు మొక్కలు, పొదలను తొలగించి ప్రాంగణాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు.పాఠశాల ప్రాంగణాలతో పాటు తరగతి గదుల పరిసరాలు, ఆట స్థలాలు, నీటి వనరుల ప్రాంతాల్లోనూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మేనక మాట్లాడుతూ.. పాఠశాలలు విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే కేంద్రాలుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.పాఠశాలల్లో పరిశుభ్రతను ఒకరోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా నిరంతరం కొనసాగించాలని సూచించారు.పాఠశాలల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రాంగణాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతతో పాటు మెరుగైన విద్యా వాతావరణానికి పాఠశాలల పరిశుభ్రత కీలకమని అధికారులు పేర్కొన్నారు.

# నీటి కుంటలో పడి అక్కాచెల్లెళ్ల మృతి..

## ఖాసిందేవిపేటలో తీవ్ర విషాదం..


## పత్తి చేను వద్ద ప్రమాదవశాత్తు ఘటన..



**తెలుగు గళం ములుగు, సెప్టెంబర్ 20:**

ములుగు మండలం ఖాసిందేవిపేటలో ఆదివారం సాయంత్రం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నీటి కుంటలో పడి అక్కాచెల్లెళ్లు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన అజ్మద్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేను వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన కుమార్తెలు సామ్యాన్ (19), ఆసియా (10) చేను పక్కనే ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటి కుంటలో పడిపోయారు. కొంతసేపటి తర్వాత తల్లిదండ్రులు గమనించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో ఖాసిందేవిపేటలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను కలచివేశాయి. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పోచారంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



**ఘట్‌కేసర్,తెలుగు గళం:** కుటుంబ కలహాల కారణంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీకారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం డివిజన్ సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సంతోష(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం రాత్రి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతురాలి భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

